క్లుప్తంగా

అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని భీమ లింగేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, గణపతి, అయ్యప్పస్వామి, ఆదిశంకరాచార్యుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

భగవద్గీత ప్రచారం



గొంటువారిపల్లెలో భగవద్గీతను అందజేస్తున్న కమిటీ సభ్యులు

కాశినాయన : మండలంలోని గొంటువారిపల్లె, నరసాపురం గ్రామాల్లో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక గిద్దలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జేష్ట పౌర్ణమి సందర్భంగా సోమవారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. భగవద్గీతలోని సారాంశాన్ని ప్రజలకు వివరించారు. జేష్ట పౌర్ణమి సందర్భంగా గురు, శిష్య సంబంధం గురించి వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమేష్, శివకుమార్, ఖాదర్, లీలానారాయణ, సుభాషిణి, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబ పేరంటాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : నెల్లూరు జిల్లా నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం నుంచి గురువారం వరకు బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి 10 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

గోపవరం : వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు రోశయ్య తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. భూమి ఆన్‌లైన్‌కు సంబంధించి అర్జీలు అధికంగా వచ్చాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణన్, పశువైద్యాధికారి కృష్ణవేణి, ఎంఈఓ చెన్నయ్య, పీఆర్ ఏఈ చిట్టిబాబు, ఈఓపీఆర్‌డీ హసీనా, వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీబీఎస్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా రామమోహన్



మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం (ఏపీబీఎస్‌టీఎఫ్) కడప జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా గోశెట్టి రామమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన మైదుకూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఫోరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ జీవశాస్త్రంలో వచ్చే మార్పులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు ఫోరం ద్వారా అప్డేట్ చేసుకుంటూ విద్యార్థులకు అందించాలని ఫోరం సభ్యులను కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మార్చి 18 నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ. 35,492 లభించినట్లు ఈఓ శ్రీధర్ తెలిపారు.

వేడుకగా పల్లకీ సేవ



రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం రంగురంగల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢ వీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పూజలు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు జరిపించారు. పూజలలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్న ప్రసాదం అందజేశారు.

వైభవంగా గ్రామోత్సవం



పుల్లంపేట: మండల కేంద్రంలో శ్రీ పర్వతవర్ధినీ శాంతిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శివ పార్వతుల గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజ లు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామి వారిపై ప్రజలకు విశ్వాసం.

స్వచ్ఛ జలం.. ఆరోగ్యం సురక్షితం

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాగునీరు కలుషితంతో పలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. అందువల్ల వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి మోతాదులో బ్లీచింగ్ పౌడర్ కలిపితే వ్యాధుల బారీ నుంచి తప్పించుకోవచ్చు. నీరు కలుషితం కాకుండా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్‌ల పరిశుభ్రతకు చర్యలు
- తాగునీరు కలుషితం కాకుండా స్పెషల్ డ్రైవ్
- సురక్షిత నీటిని అందించేందుకు ప్రణాళిక



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది



ఎర్రగుంట్లలో మంచి నీటి ట్యాంక్

ఎర్రగుంట్ల : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన రక్షిత తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ఉపక్రమించారు. ముఖ్యంగా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసేందుకు ప్రణాళిక రూపొందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు నీటి సరఫరా చేసే మంచి నీటి పైపుల లీకుల వలన నీరు కలుషితం అవుతోంది, పైపులను సకాలంలో గుర్తించక పోవడం, వాటి నుంచి సరఫరా అయ్యే నీటిని తాగడం వలన వాంతులు, విరేచనాలతో రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పంచయతీరాజ్ శాఖల అధికారులు ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో 4 ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, రెండు భూగర్భ సంపులు ఉన్నాయి, అలాగే మండల పరిధిలోని గ్రామీణా ప్రాంతాలలో 12 ఓహెచ్‌ఆర్ ట్యాంకులు 27 పీడబ్ల్యూస్ స్కీంలు, 5 ఎంపీడబ్ల్యూస్ స్కీంలు, 115 చేతి పంపులు ఉన్నాయి. మండలం పరిధిలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అలాగే మున్సిపల్ పరిధిలో ఇంజినీర్ శాఖ అధికారులు కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలంటూ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తున్నారు.

నీటి శుద్ధీకరణ ఇలా..

- ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలి. అలాగే ఆయా ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీని, తిరిగి శుభ్రం చేసే తేదీని పేర్కొనాలి.
- ప్రతి 20 లీటర్ల నీటికి 0.50 మిల్లీ గ్రాముల క్లోరిన్ ట్యాబ్లెట్ కలపాలి.
- గ్రామ పంచాయతీల్లో, మున్సిపాలిటీలలో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి.
- రక్షిత మంచి నీటి ట్యాంకుల పరిసరాలలో నీరు కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉంచాలి.
- ఆర్‌డబ్ల్యూస్ ఇంజినీరింగ్, అధికారులు తమ పరిధిలోని నీటి పథకాలను తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ముఖ్యంగా తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పరిశుభ్రమైన నీటి సరఫరాకు చర్యలు



పట్టణ, గ్రామాలకు రక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ట్యాంకులను శుభ్రం చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా పైపులు లీకేజీ అవుతుంటే వాటికి మరమ్మతులు చేపడుతున్నాం, ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం.

- సురేష్, ఏఈ, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అగ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవ సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవా సంఘం సహకారంతో 800మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి, శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణునారాయణ, విజయకుమార్, లింగారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ పనులపై విచారణ జరపాలి

ఖాజీపేట : పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై విచారణ చేసి తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. ఖాజీపేట మేజర్ పంచాయతీలోని సచివాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పంచాయతీరాజ్ ఏఈ కృష్ణ ప్రసాద్ పనితీరుపై తీవ్రంగా మండిపడ్డారు. పంచాయితీలో రూ. 80 లక్షలతో పనులు జరిగినట్లు తెలిపారు. సుంకేసుల గ్రామంలో పనులు చేయకుండానే బిల్లులు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై ఆరాతీశారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ వచ్చిన తరువాత పూర్తి స్థాయిలో విజిలెన్స్ విచారణ జరిపిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీలో చేర్పించండి



కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

మైదుకూరు : మండల పరిధిలోని మూడు సంవత్సరాల వయస్సు నిండిన పిల్లలను తమ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ అధికారులు కోరారు. మైదుకూరు ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని సీతారామాంజనేయపురం, కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ ఆహ్వానిస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని ఐదు సంవత్సరాల పైబడిన పిల్లలను పాఠశాలలకు పంపించాలని ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లులకు సూచించారు. అనంతరం తల్లులకు, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకత, బోధించే విధానం, అంగన్‌వాడీ ఆహార పోషణ గురించి వివరించారు. అనంతరం పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, ధనలక్ష్మి, అనిత, అనూష, వేదమ్మ, మహాలక్ష్మి, రాజేశ్వరి, ఉష, మాబున్నీసా పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు, దేవాదాయశాఖ భూములను పరిరక్షించాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఆస్తులను, వక్ఫ్‌బోర్డు, దేవాదాయశాఖ భూములను పరిరక్షించాలని సోమవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ముస్లిం ఇన్సాఫ్ నాయకులు, ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులు, వక్ఫ్‌బోర్డు, దేవాదాయశాఖ భూములు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ఆక్రమణకు గురైన భూములను అధికారులచే సర్వే చేయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులు, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని, భవిష్యత్తులో వీటి ఆక్రమణలు జరగకుండా సూచిక బోర్డులు, ప్రహరీలు నిర్మించాలని చెప్పారు. గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలిక్, శేఖర్, రమణ, ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు, మాబు షరీఫ్, నాగేశ్వరమ్మ, నిఫూర్, మహమ్మద్, మున్న తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ నరసింగుపల్లె గ్రామంలో రెండు రోజుల క్రితం వివాదంగా మారిన స్థలాన్ని సోమవారం తహసీల్దారు శిరీష సిబ్బందితో కలసి పరిశీలించారు. సర్వే నంబరు 570/1, 570/2లో గుడి కట్టాలని గ్రామస్తులు ప్రయత్నించగా.. అదే గ్రామానికి చెందిన గంపా చలపతి, ఆయన కుమారుడు శ్రీను అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తిన విషయం తెలిసిందే. దీనిపై ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఇరువర్గాలకు సర్దిచెప్పి, సమస్యను తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దారు నరసింగుపల్లెకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం వివాదాస్పద భూమి సర్వే నంబర్లు కొలతలు వేసి హద్దులు నిర్ధారించారు. స్థలం గురించిన పూర్తి వివరాలు జిల్లా కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దారు తెలిపారు.

నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులు

కడప ఎడ్యుకేషన్: నీట్ పరీక్ష 2024 ఫలితాలు, నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న అనుమానాలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్), విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్న, వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్ర కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనో మాట్లాడారు. నీట్ పరీక్ష నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, అంజి, వినయ్, చరణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి చేస్తా

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో సోమవారం సమాఖ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు బీసీ వార్డుల్లోనే అత్యధిక మెజారిటీ వచ్చిందన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి వీలైనంత ఎక్కువగా నిధులు మంజూరు చేయించి ప్రొద్దుటూరును అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాల వేసి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, గౌరవ సలహాదారులు డాక్టర్ గురుమూర్తి, ఎస్‌వీడీసీ కరస్పాండెంట్ హరినారాయణ, చంద్రమౌళి, కోశాధికారి సంటెయ్య, కార్యదర్శులు భాస్కర్‌రావు, శ్రీను, జీసీ పుల్లయ్య, ఉపాధ్యక్షులు భాస్కర్ యాదవ్, చౌడయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఆధ్యాత్మిక ప్రసంగం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందని ఆర్య వైశ్య సభ కార్యదర్శి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి రోజూ సాయంత్రం 6 గంటలకు "భాగవతాంతర్గత ప్రహ్లాద చరితం, నృసింహ అవతార ఘట్టం, నవవిధ భక్తి మార్గములు–ఉపాసన" అనే అంశంపై ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రవచనాలు వినాలని కోరారు.

26న వేలం పాట

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పాత కూరగాయాల మార్కెట్, కొత్త కూరగాయల మార్కెట్, గొర్రెల మాంసపు అంగళ్లు, ఎద్దుల మాంసపు అంగళ్లకు ఈనెల 26వ తేది మళ్లీ వేలంపాట నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

చదరంగంలో క్రీడాకారిణి ప్రతిభ

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన ఎస్. అమీనా చదరంగం పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచింది. చెన్నై నగరంలో ఈనెల 23వ తేదీన నిర్వహించిన అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అమీనా అండర్–8 విభాగంలో 9వ స్థానం సాధించింది. ఈ చిన్నా రితో పాటు నగరానికి చెందిన సీనియర్ క్రీడాకారిణి ఉమాదేవి 55 ప్లస్ విభాగంలో రాణించి ప్రత్యేక బహుమతి అందుకున్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



ఆరోగ్యకేంద్రంలో టీకా వేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని విద్యాధికారి వెంకటేశ్వర్లు కోరారు. బీసీజీ టీకాను మండలంలోని అన్ని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ధూమపానం, మధుమేహ వ్యాధి గ్రస్తులకు, టీబీ మందులు వాడి తగ్గిన వారికి, 60 ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ బీసీజీ టీకా వేయడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని ఆరోగ్యకేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, సోమవారం, గురువారం పెద్దలకు బీసీజీ టీకా వేస్తారన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

అగ్రిల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోండి



అగ్రిల్యాబ్ వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ నాగరాజు

అట్లూరు : రైతులకు ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ (వ్యవసాయ సమగ్ర నాణ్యత పరీక్షా కేంద్రం)తో రైతులకు ఎంతో ప్రయోజనకరమని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. సోమవారం బద్వేలులోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. ల్యాబ్ సిబ్బందితో విత్తన, ఎరువుల నాణ్యత పరీక్షా విధానం వాటి ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు ల్యాబ్‌లో ఉచితంగా చేయించుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రాథమిక వైద్య సేవలపై అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విమానాశ్రయంలో పనిచేస్తున్న వివిధ విభాగాల సిబ్బంది ప్రాథమిక వైద్య సేవలపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వర సుబ్రమణ్యం, డాక్టర్ వంశీలు తెలిపారు. సోమవారం కడప నగర శివార్లలోని విమానాశ్రయంలో ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఎయిర్‌పోర్టు అగ్నిమాపకదళం, ఇండిగోఎయిర్‌లైన్స్ సిబ్బందికి ప్రాథమిక వైద్య సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విమాన ప్రయాణికులకు అత్యవసర వైద్య సేవలు అవసరమైన సమయంలో తక్షణమే స్పందించాల్సి ఉంటుందన్నారు. తాము తెలియజేసిన అంశాలను అవసరమైన సమయంలో ఆచరణలో పెట్టాలని సూచించారు.

రైతులకు పెట్టుబడి సాయం జమ చేయాలి



డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్/ కడప వైఎస్సార్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఖాతాల్లో జమచేయాలని సోమవారం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఆర్వోకు విన్నవించారు. గత ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావం, డిసెంబరులో వచ్చిన తుఫానుతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సున్నా, పావలా వడ్డీ రాయితీలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రైతులపై బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయన్నారు.

డిజిటల్ సౌకర్యంతో ఖాతాదారులకు సత్వర సేవలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎల్‌ఐసీ జోనల్ మేనేజర్లు శ్యామ్‌సుందర్, పునీత్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : 47 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయాన్ని ఆధునీకరించడంతో ఖాతాదారులకు వీలైనంత త్వరలో సత్వర సేవలు అందజేయగలిగే అవకాశం లభిస్తుందని సంస్థ జోనల్ మేనేజర్లు ఎల్ కె శ్యామసుందర్, పునీత్ కుమార్ తెలిపారు. సోమవారం ఆధునీకరించిన డివిజనల్ కార్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ సేవలు లక్ష్యంగా డివిజనల్ కార్యాలయాన్ని సెంట్రలైజ్ ఏసీతో ఆధునీకరించుకోవడం సంతోషించదగ్గ ముందడుగు అన్నారు. కస్టమర్ల ఆకాంక్షలు పెరిగాయని, వారికి డిజిటల్ సేవలందించే దిశగా పయనిస్తున్నామని అన్నారు. పాలసీదారులతో దృఢమైన బంధం దిశగా జవాబుదారీతనంతో కూడిన సేవలు అందిస్తామని, ఏజెంట్స్ రిక్రూట్మెంట్ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున చేపడతామన్నారు. డివిజనల్ కార్యాలయాన్ని కేవలం 6 నెలల్లో అత్యాధునికంగా మార్చగలగడం అరుదైన విషయమని చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాస రావు, స్వామి అన్నారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ దిశగా ఎల్ఐసి తన ఆధిపత్యం నిలుపుకునే దిశగా కడప డివిజన్ పనిచేస్తుందన్నారు. ఆధునీకరణ కార్యక్రమంలో కీలక భూమిక పోషించిన ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డిలను ఉన్నతాధికారులు సత్కరించారు. డివిజనల్ మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్యప్రసాద్, చలపతి, చంద్రకళ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు ఎల్లారెడ్డి, సంజయ్, రఘునాథరెడ్డి, ఆనందరావు, రెడ్డి భాస్కర్, సుధీకర్, ముడియం కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాపార పోటీల్లో విజేతలైన ఏజెంట్లను, డెవలప్మెంట్ ఆఫీసర్లను సన్మానించారు. కార్యక్రమాన్ని సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ప్రొడక్ట్ మేనేజర్ రామకృష్ణ ఇతర అధికారులు పర్యవేక్షించారు.